నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 12 జనవరి 2024 | ADILABAD

## గురుబాబా మందిరంలో ఎమ్మెల్యే పూజలు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

నేరడిగొండ, జనవరి 11 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని రోల్‌మామడలో గల గురుబాబా మందిరంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. గురుకృప దివస్‌ను పురస్కరించుకొని మందిరాన్ని సందర్శించారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, స్థానిక సర్పంచ్ సోలంకి గీత, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

## నోటిఫికేషన్ ఆధారంగానే పోస్టులను భర్తీ చేస్తున్నాం..



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఎదులాపురం, జనవరి 11 : ఆదిలాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలోని పోస్టులను పారదర్శకంగా భర్తీ చేస్తున్నామని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్‌హెచ్‌ఎం-పీఎం జన్‌మన్ పరిధి కింద దరఖాస్తులు స్వీకరించి, ఇంటర్వ్యూలు నిర్వహించామని తెలిపారు. వైద్య, ఆరోగ్యశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. ఐదు మెడికల్ ఆఫీసర్, ఐదు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశామని పేర్కొన్నారు. ల్యాబ్ టెక్నీషియన్‌కు 100 మంది హాజరయ్యారన్నారు. ఐదుగురితో పాటు, మెడికల్ ఆఫీసర్‌ను తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిక కమిటీ సభ్యులు ఏఎస్‌డబ్ల్యూవో నారాయణరెడ్డి, ఎన్‌హెచ్‌ఎం డీపీఎం అనిల్, సీనియర్ అసిస్టెంట్లు శ్రీకాంత్‌రెడ్డి, గోపి పాల్గొన్నారు.

## నిర్దేశిత లక్ష్యం మేరకు సీఎంఆర్ పూర్తి చేయాలి..



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, జనవరి 11 : నిర్మల్ జిల్లాలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో సీఎంఆర్ బియ్యాన్ని నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం సీఎంఆర్ బియ్యం సేకరణపై అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశాన్ని నిర్వహించారు. రైస్‌మిల్లర్లు వారం రోజుల్లో బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని, లేని పక్షంలో ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే అనేక మార్లు బియ్యం గడువును పొడిగించడం జరిగిందని, రికార్డులు సక్రమంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ఈ సమావేంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఎం శ్రీకళ పాల్గొన్నారు.

**రేపటి లోగా ఆధార్ అప్‌డేట్ చేయండి..**

ఈనెల 13వ తేదీలోగా ఆధార్ కార్డు అప్‌లోడ్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయాలని స్థానిక సంస్థల కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్‌లో ప్రధానమంత్రి జనవాయితీ ఆదివాసీ న్యాయ అభియాన్‌పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌కు 12 కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో సుధీర్ కుమార్, డీసీడబ్ల్యూవో అంబాజీ, డీఆర్వో లోకేశ్ పాల్గొన్నారు.

**ఘనంగా ఓబన్న జయంతి**

నిర్మల్ కలెక్టర్‌లో గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఓబన్న జయంతి వేడుకలను నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్‌లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజేశ్వర్‌గౌడ్, ఒడ్డెర సంఘం నాయకులు ప్రభాకర్, గురువయ్య, గంగాధర్, నర్సయ్య, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

## ఓబన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలి..

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్


ఓబన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు, కుల సంఘాల నాయకులు

ఎదులాపురం, జనవరి 11 : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబన్న 217 జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. ఓబన్న పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేయాలన్నారు. ఒడ్డెర కులస్తుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. ఒడ్డెర కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రాథోడ్ రమేశ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఆ పులులెక్కడ?

## అడవిని జల్లెడ పడుతున్న అటవీశాఖ అధికారులు

- 13 బృందాలుగా విడిపోయి ట్రాకింగ్
- మూడు పులుల పాదముద్రల గుర్తింపు..
- సురక్షితంగా ఉన్నట్లు భావిస్తున్న అధికారులు
- విషప్రయోగంపై ఆరుగురిని అదుపులోకి తీసుకొని సీన్ రీ-కన్‌స్ట్రక్షన్

మంచిర్యాల, జనవరి 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : విషప్రయోగంతో పులులు చనిపోయిన ఘటనతో ఒక్కసారిగా ఉలిక్కి పడ్డ జిల్లా అటవీ శాఖ, మిగిలిన పులుల జాడ కోసం అడవిని జల్లెడ పడుతున్నది. బుధవారం మొదటి రోజు 70 ట్రాకర్లతో 15 బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టిన అధికారులు, రెండోరోజైన గురువారం 120 మంది ట్రాకర్లతో 13 బృందాలుగా విడిపోయి గాలిస్తున్నారు. రెండు పులులు మృతి చెందిన కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని దరిగాం అటవీ ప్రాంతంతో పాటు ఆసిఫాబాద్, సిర్పూర్ డివిజన్‌లలోనూ అన్వేషిస్తున్నారు. ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని వాంకిడి మండలం సర్కేపల్లి చుట్టూ ఉన్న భారీ గుట్టలు, దట్టమైన అడవిని నలువైపులా ట్రాకింగ్ చేశారు. ఈ క్రమంలోనే అధికారులు మూడు పులుల పాదముద్రలను గుర్తించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎస్-9, ఎస్-15 మృతి చెందగా, ఎస్-9(మగపులి) జతగా ఉన్న ఎస్-6(ఆడపులి)తో పాటు వాటి పిల్లలైన మరో రెండు పులుల పాదముద్రలు గుర్తించినట్లు తెలిసింది. దీంతో ఆ మూడు పులులు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ పులుల జాడను ట్రాక్ చేసేందుకు కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, సిర్పూర్‌తో పాటు గురువారం మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నుంచి ట్రాకర్ల బృందాలను రప్పించారు. తొలుత మృతి చెందినట్లు గుర్తించిన ఎస్-15 పులి ఇంకో పులితో పోరాడి చనిపోయినట్లు చెప్పిన అధికారులు.. ఇప్పుడు ఆ పులి సైతం విషప్రయోగంతోనే మరణించి ఉంటుందని భావిస్తున్నారు. మొత్తం ఆరు పులుల్లో రెండు చనిపోగా, మూడు సురక్షితంగా ఉన్నాయనుకుంటే, మరో పులి ఏమైందన్నది తేలాల్సి ఉంది. అయితే ఈ ఆరు పులుల్లో ఒకటి ఎప్పటి నుంచో తల్లిదండ్రులను వదిలేసి వేరుగా సంచరిస్తున్నదని, విషం తిన్న పులుల్లో అది ఉందా లేదా అనేది ఇప్పుడు సందేహంగా మారింది. ఈ విషయంలో అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.


అధికారులు పాదముద్రలు గుర్తించినట్లుగా చెప్తున్న ఎస్-6(ఆడపులి), దాని పిల్లలు

**అదుపులో ఆరుగురు..సీన్ రీ-కన్‌స్ట్రక్షన్**

విషప్రయోగం చేసినట్లుగా అనుమానిస్తున్న ఆరుగురిని అధికారులు బుధవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. వాంకిడి మండలం సర్కేపల్లి గ్రామానికి చెందిన నలుగురు, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని దరిగాం గ్రామానికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా, ఇందులోని ఇద్దరు తామే విషప్రయోగం చేసినట్లు ఒప్పుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. విష ప్రయోగం చేసిన ఇద్దరు కూడా సర్కేపల్లి వాసులుగా చెబుతున్నారు. ఈ ఇద్దరితో పాటు అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు మైనర్లు, దరిగాంకు చెందిన మరో ఇద్దరు విషప్రయోగానికి సహకరించినట్లుగా అధికారులు భావిస్తున్నారు. వీరంతా ఇప్పుడు అదుపులోనే ఉన్నారు. గురువారం ఉదయం ఈ ఆరుగురిని అధికారులు అడవిలోకి తీసుకెళ్లి.. పులులకు విషప్రయోగం చేసి ఆహారాన్ని తింటున్నప్పుడు ఎక్కడి నుంచి చూశారు.. ఎలా వీడియో తీశారు.. అనే విషయాలపై సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ చేశారు. పశుకళేబరంపై విషం చల్లిన తర్వాత .. ఆ డబ్బాను పడేసిన ప్రాంతంతో పాటు వారు వచ్చి వెళ్లిన మార్గాన్ని అధికారులకు చూపించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. గురువారం రాత్రి వరకు పులుల కోసం వెతుకులాట కొనసాగింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

### పులి దాడిలో లేగదూడ మృతి

కాగజ్‌నగర్, జనవరి 11 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఊట్‌పల్లి గ్రామ అటవీ ప్రాంతంలో లేగదూడపై పులి దాడి చేసిన విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఊట్‌పల్లి గ్రామ శివారులోకి సోమవారం పశువులు మేతకు వెళ్లాయి. మూడేళ్ల లేగదూడపై పులి దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయాన్ని పశువుల కాపరి అదే రోజు సాయంత్రం వెళ్లి దాని యజమానికి తెలియజేశాడు. చివరకు గ్రామస్తులకు తెలియడంతో వారు గురువారం అటవీశాఖ అధికారులకు తెలిపారు. ఈ ఘటనపై వెళ్లి విచారణ చేపడుతున్నారు.

### కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయం ఎదుట ఆందోళన

కాగజ్‌నగర్, జనవరి 11: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం దరిగాం గ్రామ అటవీ ప్రాంతంలో పులులు మృతి చెందిన ఘటనపై అటవీశాఖ అధికారులు విచారణ చేపడుతున్నారు. షర్కపల్లి, రింగరీట్, దరిగాం గ్రామాలకు చెందిన పలువురు అనుమానితులను బుధవారం అదుపులోకి తీసుకొని కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. గంటల కొద్దీ వేచి ఉన్నా తమ పిల్లలను కలువనివ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి ఆధ్వర్యంలో గురువారం రాత్రి కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.


పిల్లల కోసం పడిగాపులుకాస్తున్న కుటుంబ సభ్యులు

దీంతో వెనక్కి తగ్గిన అధికారులు తమ అదుపులో ఉన్నవారిని కలిసేందుకు అనుమతించారు. ఇందులో ఇద్దరు మైనర్ బాలురు ఉండగా, వారిని బయటకు పంపించారు. వారు మీడియాతో మాట్లాడుతూ తమను ఇష్టారాజ్యంగా కొట్టారని, దీంతో భయపడి ఒప్పుకున్నట్లు వేలిముద్రలు వేశామని ఆవేదన వ్యక్తం చేశారు. అదుపులో ఉన్నవారందరినీ బట్టలు విప్పి కొట్టారంటూ మైనర్ బాలురు చెప్పారు.


కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దరిగాం అడవుల్లో మృతిచెందిన పులి కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు


కాగజ్‌నగర్ కారిడార్‌లో పులుల కోసం అన్వేషిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

## హైమన్‌డార్ఫ్‌కు ఘన నివాళి

- పాల్గొన్న ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, బొజ్జు, ఎంపీ బాపూరావ్, మాజీ ఎంపీ గోడం నగేశ్



హైమన్ డార్ఫ్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్ జనవరి 11: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవం, ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్-బెట్టి ఎలిజబెత్ దంపతుల 37వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్, మాజీ ఎంపీ గోడం నగేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పాల్గొని డార్ఫ్ దంపతుల సమాధుల వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వర్ధంతి సభలో వారు మాట్లాడుతూ అడవిబిడ్డల అభ్యున్నతికి హైమన్‌డార్ఫ్ దంపతులు చేసిన సేవలను కొనియాడారు. మార్లవాయిని ఆదర్శంగా తీర్చిదిద్దిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ కనక ప్రతిభవెంకటేశ్ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించుకోవడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ కేసీఆర్ సర్కారులో మార్లవాయిని ఎంతో అభివృద్ధి చేశామని కొనియడారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ కనకరాజు, రాష్ట్ర మహిళా ఉద్యమ నాయకురాలు సుగుణక్క, ఎంపీపీ తిరుమల విశ్వనాథ్, వైస్ ఎంపీపీ చెర్లె లక్ష్మణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మడావి భీంరావ్, ఆదివాసులు తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ నీరు ఆరోగ్య ప్రదాయిని

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- గుబిడిపల్లి, కొలాం ఆవాసం జలకొరి గ్రామాల్లో పర్యటన

భీంపూర్, జనవరి 11 : మిషన్ భగీరథ నీరు స్వచ్ఛమైనదని, ప్రజలంతా భగీరథ నీటిని తాగాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని గుబిడిపల్లి, కొలాం ఆవాసం జలకొరి గ్రామాలను కలెక్టర్ గురువారం సందర్శించారు. గుబిడిపల్లిలో కొందరికీ కిడ్నీ వ్యాధులు ఉన్నాయని తెలుసుకున్న కలెక్టర్ అక్కడి తాగునీటిని పరీక్షించగా శుద్ధ జలం అని తేలింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మద్యం తాగడం వల్ల లివర్, కిడ్నీలు చెడిపోతాయని తెలిపారు. ఇక్కడి నీటితోనే వ్యాధులు వస్తున్నాయనే అపోహను విడనాడాలని పేర్కొన్నారు. అయినప్పటికీ త్వరలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని, పిల్లలు మినహా అందరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. జలకొరి కొలాం గ్రామంలో పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా పక్కా ఇండ్లు నిర్మిస్తామని, గ్యాస్ కనెక్షన్లు ఇస్తామని, శాశ్వత అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. కలెక్టర్ వెంట వైద్యాధికారి నిఖిల్ రాజ్, భగీరథ ఎస్ఈ సురేశ్, ఏఈ చంద్రశేఖర్, ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ హరీశ్ ఉన్నారు.

# గురుకులం పిలుస్తోంది

## ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- 6,7,8 తరగతుల్లోని ఖాళీ సీట్లకు నోటిఫికేషన్ జారీ
- ఈనెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణ
- ఫిబ్రవరి 11న ప్రవేశపరీక్ష

**గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశానికి రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నది. మౌలిక వసతులు, నాణ్యమైన భోజనం, బోధన ఉండడంతో విద్యార్థులు చేరడానికి ఉత్సాహం చూపుతున్నారు. దీంతో ప్రభుత్వం ప్రవేశ పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నది. ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు ఉండడం, వందలాది సీట్లకు వేలాది మంది పోటీ పడుతుండడంతో విద్యార్థులు కోచింగ్ బాట పడుతున్నారు. మూడు, ఆరు, ఏడాది పాటు శిక్షణ తీసుకుని సీటు దక్కించుకుంటున్నారు.**


నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ గల బాలికల గురుకుల విద్యాలయం

నిర్మల్ అర్బన్, జనవరి 11 : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఏడు బీసీ, ఒకటి ఎస్టీ, ఐదు ఎస్సీ గురుకులాలు ఉన్నాయి. నిర్మల్ నియోజకవర్గంలోని రాచాపూర్(ప్రస్తుతం నిర్మల్‌లోనే ఉంది), దిలావర్‌పూర్, సారంగాపూర్.. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఖానాపూర్ (బాలికలు), ఖానాపూర్(బాలురు).. భైంసా నియోజకవర్గంలోని భైంసాలో (బాలురు), ముథోల్(బాలికలు)లో బీసీ గురుకులాలు.. ముథోల్‌లో ఎస్టీ, ఎస్సీ ఐదు గురుకులాలు ఉన్నాయి. బాసర, ముథోల్, నచ్చన్‌ఎల్లాపూర్, జాం, లెఫ్ట్ పోచంపాడ్‌లో ప్రవేశం పరీక్షను నిర్వహించనున్నారు. ప్రతి పాఠశాలలో 80 సీట్ల చొప్పున 960 సీట్లను ప్రభుత్వం కేటాయించింది. మిగతా తరగతుల్లో ఖాళీ అయిన సీట్ల కోసం ప్రత్యేక పరీక్షను నిర్వహించనున్నారు. ఐదో తరగతిలో ప్రవేశ పరీక్ష నిర్వహించి సీట్లను భర్తీ చేస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం..**

- విద్యార్థులు http tgcet.cgg.gov.in, httptswreis.ac.in,http tgtwgurukulam.telangana.gov.in దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా.. గడువు జనవరి 20వ తేదీ వరకు ఉంది. ఒక ఫోన్ నంబర్‌తో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవచ్చు.
- విద్యార్థుల ఫొటోకు బదులు వేరే విద్యార్థి ఫొటో అంటించి దరఖాస్తు చేస్తే సెక్షన్ 416, ఐపీసీ 1860 ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేస్తారు.
- ఇతర సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్ 1800 425 45678 సంప్రదించవచ్చు.

**ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష**

- ఫిబ్రవరి 11, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్షను నిర్వహించనున్నారు.
- 6,7,8 తరగతుల్లో మిగిలిన ఖాళీ సీట్లకు కూడా ప్రవేశ పరీక్ష ఉంటుంది.

మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలోని 6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు నోటిఫికేషన్‌ను జారీ చేశారు. 6వ తరగతిలో ప్రవేశానికి తేదీ ఆగస్టు 31, 2024 నాటికి 12 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు రెండేండ్లు మినహాయింపు ఉంది. విద్యార్థులు 2023-24లో 5వ తరగతి చదివి ఉండాలి. ఏడో తరగతి ప్రవేశానికి 2023-24లో ఆరో తరగతి చదివి ఉండాలి. ఆగస్టు 31, 2024 నాటికి 13 ఏండ్లు మించకూడదు. 8వ తరగతిలో ప్రవేశానికి 2023-24లో ఏడో తరగతి చదివి ఉండాలి. ఆగస్టు 31, 2024 నాటికి 14 ఏండ్లు మించి ఉండరాదు. ఖాళీ సీట్ల కోసం ఈనెల 8 నుంచి 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

## ప్రశాంతంగా సామాజిక తనిఖీ

లక్ష్మణచాంద, జనవరి 11 : లక్ష్మణచాంద ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సామాజిక తనిఖీ నిర్వహించారు. 2022-23 సంవత్సరానికి గాను నిర్వహించిన తనిఖీలో ఆడిట్ రిపోర్ట్‌ను అధికారులు వివరించారు. టెక్నికల్ అసిస్టెంట్‌లకు రూ.8,127 రికవరీకి ఆదేశించగా, రూ. 1000 పెనాల్టీ విధించారు. వివిధ గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు రూ.27,790 రికవరీకి ఆదేశించగా, రూ. 27వేల పెనాల్టీ విధించారు. ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున రూ.2వేల జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# దీక్ష భూమి.. జనసంద్రం..

## ఉమ్మడి జిల్లాతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు

- కనులపండువగా గురుకృపా మిలాన్ దివస్..
- భక్తిశ్రద్ధలతో భోగ్‌బండార్.. ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్యాలు
- దీక్షభూమిని రూ.100 కోట్లతో అభివృద్ధి చేయాలి.. : జడ్పీ చైర్మన్
- కల్యాణలక్ష్మితో ప్రభుత్వం ఆదుకుంటున్నది : ఎమ్మెల్యే బొజ్జు
- ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే జాదవ్


సేవాలాల్ మహారాజ్ పల్లకీకి స్వాగతం పలుకుతున్న భక్తులు

నార్నూర్, జనవరి 11 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని కొత్తపల్లి(హెచ్)లో గల జాతీయ బంజారా సేవాలాల్ మహారాజ్ దీక్షభూమి జనసంద్రమైంది. గురువారం దీక్షగురు ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో 45వ గురుకృపా (గురు,శిష్యుల) మిలాన్ దివస్‌ను వైభవంగా నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం భోగ్ బండార్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించి.. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ పల్లకీకి దీక్ష గురువు పూజలు చేశారు. ఈ సందర్భంగా బంజారాలు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి జిల్లాతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు దీక్షగురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆశీస్సులు తీసుకొని, ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

**దీక్షభూమిని రూ.100 కోట్లతో అభివృద్ధి చేయాలి..**

ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ మాట్లాడుతూ.. బంజారా సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందించాలని, రూ.100 కోట్లతో దీక్షభూమిని అభివృద్ధి చేయాలన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించి, సెలువు ప్రకటించాలన్నారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. ఆడ బిడ్డలు ఉన్న వారు కట్నం ఇవ్వలేని స్థితిలో ఉన్నారని, అందుకే ప్రభుత్వం కల్యాణలక్ష్మితో ఆదుకుంటున్నదని గుర్తు చేశారు. బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం భక్తులనుద్దేశించి దీక్షగురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్ హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాథోడ్ సుభద్రబాయి రామేశ్వర్, ఉట్నూర్ జడ్పీటీసీ రాథోడ్ చారులత, మాజీ మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మాజీ ఎంపీలు నగేశ్, రాథోడ్ రమేశ్ పాల్గొన్నారు.